# కాలనిర్ణీతం

శ్రీమతి యు. సత్యబాలసుశీలాదేవిగారు

ఆమె తనచిన్నిచంద్రుణ్ణి పోగొట్టుకొని చాలారోజులయింది. అయినా మిసిమిచిందుతూండె తెల్లనిసొట్టబుగ్గలలేతనవ్వు, చిన్నిచేతుల చల్లని కౌగిలింత, వొళ్లుమరిపించే—ఆముఖచంద్రుడి ముద్దులమురిపెము తలుచుకుంటే ఆమె తడియారిపోయిన పేదగుండెలు కుమిలిపొయ్యేవి. "నాచిట్టిచంద్రుణ్ణి ఎలా మరచిపొయ్యేది? భగవంతుడా!" అనుకుంటే ఆమెకళ్లు కెంపువర్ణంగా జలపూరిత ఘటాలయిపొయ్యేవి. ఆదుఃఖావేగంలోనే ఆమెపరవశయై కళ్లుమూసుకునేది. ఆవిస్మృతావస్థలోనే ఆమెకోస్వప్నం.

చంద్రుడు ఆడుకుంటూ, ఆడుకుంటూ అమ్మను వెతుక్కుంటూవచ్చేసి "అమ్మా! నన్నువిడిచిపెట్టేశావా" అన్నట్టు జాలిచూపులుచూస్తూ చేతులందించేడు. అంతులేని హృదయావేగంతో దరిగానలేనిదరిద్రుడు ధనపుమూటను వలె బిడ్డను వక్షానికదిమేసుకుని తనివితీర ముద్దులాడుతోంది. మాతాశిశువుల ప్రేమపథపర్యవసానప్రదర్శనం కాబోలు! చంద్రకుమారుడామాతృమూర్తిలో నిశ్శేషంగా లీనమయ్యేడు.

మరికొన్నినెలలకామె పసిబిడ్డతల్లి. ఈప్రేమామృతఝరిలో ఆదుఃఖనిలం సంపూర్ణార్ద్రమైపోయింది. వొళ్ళోఉన్నపిల్లాణ్ణి పలుకరించి, పలుకరించి తన్మయత్మం పొందుతోంది. తీర్చిదిద్దినట్టున్నపిల్లాడి నల్లనికనుబొమలు చేత్తోసవరిస్తూ దగ్గరగానవ్వుతూ నించోనున్న భర్తకుచూపిస్తూ 'చూడండి! సమంగా చంద్రుడిముఖమే! అచ్చుగుద్దినట్టే. ఆకళ్ళూ, నొసలూ, ... 'అంటూ మాతృమమకారంతో మందహాసంచేసింది.

మాతృమూర్తీ! చిరకాలమువటకట్టే అమృతహాస మొసర్పుము!
దుఃఖమా! మరియిచ్చట నీశక్తపదీ!
సుఖమా! నీనిలవరమేది?
కాలమా! నీనిర్ణీతమేమి?